క్లుప్తంగా

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న వాల్మీకి మహర్షి ట్రస్టు చైర్మన్

ఆదోనిఅర్బన్: పట్టణంలోని బాలాజీ నర్సింగ్ హోమ్‌లో ఆదివారం ఎస్టీ బెనిఫిట్స్, వాల్మీకుల ఐక్యతకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. దక్షిణ భారతదేశ వాల్మీకి మహర్షి ట్రస్టు చైర్మన్ బి.రంగనాయకులు, డాక్టర్ వై.బాలాజీ అడ్వైజర్ శేషయ్య, వెంకటేష్, రాముడు తదితరులు మాట్లాడారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రభుత్వాలు ముందుకు రావాలన్నారు. వాల్మీకులు ఐక్యంగా ప్రభుత్వాలపై పోరాడాలని పిలుపునిచ్చారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



పెద్దకడబూరులో కవాతు చేస్తున్న పోలీసులు

పెద్దకడబూరు: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా చర్యలు తప్పవని సీఐ ప్రసాద్ హెచ్చరించారు. సహస్ర సీమ బల్(ఎస్ఎస్‌బీ) ఆధ్వర్యంలో పెద్దకడబూరు మండల కేంద్రంతో పాటు చిన్నకడబూరు, హనుమాపురం గ్రామాల్లో ఆదివారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మండలంలో ఎలాంటి ఘర్షణలు జరగకుండా ముందస్తుగా ఎస్ఎస్‌బీ బలగాలతో కవాతు నిర్వహిస్తున్నామని తెలిపారు. అల్లర్లకు పాల్పడేవారు, మట్కా, జూదం, సారా, అక్రమ మద్యం లాంటివి ఎక్కడా కనిపించరాదన్నారు. శాంతిభద్రతలను కాపాడుకోవడానికి పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మహేష్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా మల్లికార్జున



కౌతాళం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా మల్లికార్జున బాధ్యతలు స్వీకరించారు. కర్నూల్ కేవీఆర్ బాలకల కళాశాలలో పనిచేస్తున్న ఈయన పదోన్నతిపై ప్రిన్సిపల్‌గా కౌతాళంకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్న సంతోష్‌కుమార్ నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తానన్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



మాళ మల్లేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

హొళగుంద: ఆంధ్ర, కర్ణాటక భక్తుల ఆరాధ్య దైవం దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామికి ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి. ఈ సందర్భంగా తెల్లవారుజామున పూజారులు స్వామివారి మూల విరాట్‌లకు సుప్రభాత సేవ, అభిషేకాలు, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, నైవేద్య సంతర్పణతో పాటు రుద్రాభిషేకం ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

కస్తూర్బాలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

హొళగుంద: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ప్రవేశం పొందడానికి ఏప్రిల్ 11వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని స్పెషల్ ఆఫీసర్ దివ్య భారతి సూచించారు. ఆమె మాట్లాడుతూ.. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతితో పాటు ఇంటర్మీడియెట్‌లో అడ్మిషన్ కోసం అన్ని సర్టిఫికెట్లతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన నిరుపేద విద్యార్థినులు, అనాథ బాలికలు, బడిఈడు, బడి వదిలేసిన బాలికలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, విద్యార్థినులు ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉండాలని చెప్పారు. ప్రస్తుతం కేజీబీవీలో 6వ తరగతి, ఇంటర్ ఫస్ట్‌ఇయర్‌లో 40 సీట్లు చొప్పున ఖాళీగా ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు. 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి త్వరలో ప్రకటన వస్తుందని చెప్పారు. నిరుపేద విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

‘పది’ పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి 10వ తరగతి పరీక్షలు
- ఆదోని డివిజన్‌లో 15,700 మంది విద్యార్థులు
- 84 సెంటర్‌లు ఏర్పాటు
- కేంద్రాల వద్ద 144 సెక్షన్
- సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలతో నిఘా



పరీక్షల షెడ్యూల్ ఇలా

తేదీ	సబ్జెక్టు	సమయం
18.03024	ఫస్ట్‌లాంగ్వేజ్(తెలుగు)	9.30-12.45
19.03.24	సెకండ్‌లాంగ్వేజ్(హిందీ)	9.30-12.45
20.03.24	ఇంగ్లిష్	9.30-12.45
22.03.24	మేథమెటిక్స్	9.30-12.45
23.03.24	ఫిజికల్ సైన్స్	9.30-11.30
26.03.24	బయోలాజికల్ సైన్స్	9.30-11.30
27.0324	సోషియల్	9.30-12.45
28.03.024	ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-2	9.30-11.15

ఆదోని సెంట్రల్/ఆదోనిటౌన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదోని డివిజన్‌లో అన్ని ప్రభుత్వ, యాజమాన్య పాఠశాలలకు చెందిన 15,383 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షల నిర్వహణ కోసం 84 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక ఆదోని నియోజకవర్గంలో 19 పరీక్ష కేంద్రాల్లో 3,589 మంది విద్యార్థులు పరీక్షలను రాయనున్నారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించారు. విద్యార్థులకు తాగునీరు, పరీక్ష కేంద్రాల్లో తగినంత గాలి, వెలుతురు ఉండేలా ఏర్పాట్లు చేశారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాలకు అరగంట ముందుగానే చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు.

కోసిగిలో 800 మంది విద్యార్థులు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు. కోసిగి బాలుర ఉన్నత పాఠశాలలో రెండు సెంటర్లు ఏర్పాటు చేశారు. ఏ సెంటర్‌లో 220 మంది, బీసెంటర్‌లో 220 మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 300 మంది, మౌంట్ కార్మెల్ పాఠశాలలో 180 సహా మొత్తం 820 మంది విద్యార్థుఉ పరీక్షలు రాయనున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని అధికారులు తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



సోమవారం నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం చేశాం. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదోని డివిజన్‌లో 15,700 మంది విద్యార్థులు 84 సెంటర్లలో పరీక్షలు రాయనున్నారు. ఇందు కోసం వెయ్యి మంది సిబ్బందిని ఏర్పాటు చేశాం. సమస్యాత్మక కేంద్రాలుగా ఆస్పరి, దేవనకొండ సెంటర్‌లను గుర్తించాం. ఫ్లయింగ్ స్క్వాడ్ 08, సిప్పింగ్ స్క్వాడ్ 08 ఏర్పాటు చేశాం. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, వైద్యం తదితర సౌకర్యాలను కల్పించాం. ఆదోని పరిసర ప్రాంతాల్లో 17 సెంటర్‌లతో పాటు ఆదోని మండలం పెద్దతుంబళంలో ఒకటి, పెద్ద హరివాణంలో ఒకటి, మొత్తం 19 సెంటర్‌లను ఆదోనిలో ఏర్పాటు చేశాం. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని సూచించాం.

– వెంకటరమణారెడ్డి, డిప్యూటీ డీఈఓ

ఎన్నికల నిబంధలను పాటించాల్సిందే



బ్యానర్లు, పోస్టర్లకు స్టిక్కర్లు

కౌతాళం: ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తా అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన కౌతాళంతో పాటు వివిధ గ్రామాల్లో ఉన్న రాజకీయ పార్టీల బ్యానర్లు, పోస్టర్లను తొలగించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎవరూ ఇళ్లపై, ప్రభుత్వ స్థలాలు, బస్టాండ్ వంటి ప్రాంతాల్లో పార్టీల బ్యానర్లు, పోస్టర్లను ఉంచరాదని తెలిపారు. నిబంధనలకు కట్టుబడి ఉండాలన్నారు. ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

వైఎస్సార్‌సీపీతో సొంతింటి కల సాకారం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదోనిరూరల్: ప్రతి గడపకు సంక్షేమ పథకాలతో పాటు పేదల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కిందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కల్లుపోతుల సురేష్ అన్నారు. ఆదివారం మండిగిరిలోని తిరుమలనగర్ కొట్టాల, శాంతిమల్లప్పకొండ, బాబాగార్డెన్ ప్రాంతాల్లో ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చారని తెలిపారు. ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందించారని చెప్పారు. మరోసారి వైఎస్సార్‌సీపీ ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు హరిదాసు, కోటిరెడ్డి, శ్రీధర్‌యాదవ్, ఆలీదాస్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



పల్లెదవీధి (నాడు) ,




సిమెంటు రోడ్డు వేసిన తర్వాత (నేడు)

పల్లెదవీధి రోడ్డుకు మోక్షం

కౌతాళం: పల్లెదవీధి వాసులు కల నేరవేరింది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రోడ్డు సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. కౌతాళంలోని ఖాదర్‌లింగ స్వామి దర్గా వెనుక ప్రాంతంలో ఈ వీధి ఉంది. రోడ్డు గుంతలు ఏర్పడి మురుగు నీరు చేరుతుండడంతో స్థానికులు ఇబ్బందులు పడేవారు. గత ప్రభుత్వం హయాంలో ఎన్నోసార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఈ సమస్యను ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి పంచాయతీ నిధులు మంజూరు చేయించడంతో సిమెంట్ రోడ్డు వేశారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు గురుసుబ్బారూడ స్వామి రథోత్సవం



ఊరేగింపునకు ముస్తాబైన రథోత్సవం, (ఇన్‌సెట్)గురుసుబ్బారూడ స్వామి

కోసిగి: మండల కేంద్రం కోసిగి రంగప్పగట్టులో గురుసుబ్బారూడస్వామి 61వ మహా రథోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. పాల్గుణ శుద్ధ దశమిని పురస్కరించుకుని వేకువజాము నుంచి స్వామివారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, ఫల, పుష్పాలంకరణ, వెండి కవచ అలంకరణ, ప్రత్యేక పూజలు చేయనున్నారు. సాయంత్రం ఆలయం నుంచి పెండేకల్లు ఆంజనేయస్వామి దేవాలయం వరకు మల్లికార్జునస్వామి పల్లకోత్సవం నిర్వహించి ఉత్సవమూర్తిని రథంపై కొలువుంచి మేళతాళాలు, డప్పువాయిద్యాలతో ఊరేగించనున్నారు. ఊరేగింపు మధ్యలో ఆలయ పూజారి భవిష్యవాణి భక్తులకు వినిపిస్తారు. రాత్రి భజన కార్యక్రమం జరుగుతుందని ఆలయ కమిటీ కార్యదర్శులు మఠం చంద్రయ్య, బొంబాయి దయా తెలిపారు. భక్తులకు అన్నదానం చేయనున్నారు.

ఈరన్నస్వామి ఆలయంలో చలువ పందిళ్లు



ఆలయ వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిరి,



ఉత్తర ద్వారంలో..

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయం వద్ద ఎండ వేడిమిని దృష్టిలో ఉంచుకుని భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు ఏర్పాటు చేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ హెచ్ వెంకటేశ్వర్లు, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. భక్తుల క్యూలైన్‌లు, ఆలయ పరిసరాల్లో పందిళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. దేవస్థానం వద్ద నిర్వహిస్తున్న గోశాలకు కర్ణాటకకు చెందిన భక్తులు ఆరు ట్రాక్టర్ల పశుగ్రాసం విరాళంగా అందజేసినట్లు తెలిపారు.

కౌతాళంలో ఐదు కేంద్రాల్లో పరీక్షలు

కౌతాళం: మండలంలోని ఐదు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు జరగనున్నట్లు మండల విద్యాధికారి శోభారాణి అన్నారు. సోమవారం మొదటి లాంగ్వేజ్ పేపర్ తెలుగు, కన్నడ పరీక్ష ఉంటుందని తెలిపారు. జెడ్పీ పాఠశాలలో ఏ,బీ సెంటర్లలో 200 మంది విద్యార్థులు, కస్తూర్బా పాఠశాలలో 120 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 220 మంది, ప్రతిభ హైస్కూల్‌లో 230 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వెల్లడించారు. మొత్తం 970 మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. ఇందు కోసం 52 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. విద్యార్థులు సమయ పాలన పాటించాలని సూచించారు.

22న వేలం పాట

కోసిగి: స్థానిక పంచాయతీ పరిధిలోని వారపు సంత, బండి మెట్టు, చిన్న కమేళ, పెద్ద కమేళా నిర్వహణకు ఈనెల 22వ తేదీ బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ కుమారి అయ్యమ్మ, పంచాయతీ ఈఓ చంద్రశేఖర్ తెలిపారు. వేలంలో పాల్గొనే వారు వారపు సంత, బండి మెట్టుకు ముందుగానే రూ.50 వేలు డిపాజిట్ చేసి రూ.2 లక్షల ఆస్తి సర్టిఫికెట్, చిన్న కమేళా, పెద్ద కమేళాకు రూ.5 వేలు డిపాజిట్ చేసి రూ.25 వేలు ఆస్తి సర్టిఫికెట్ అందజేయాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కన్నా ఎవరు ఎక్కువగా పాడుకుంటారో వారికి హక్కులు కల్పిస్తామన్నారు. 2024 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2025 మార్చి ఆఖరి వరకు పన్నులు వసూలు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఆదోని సీటు బీజేపీకే!

ఆదోనిఅర్బన్: బీజేపీ, టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా ఆదోని అసెంబ్లీ స్థానం బీజేపీకి కేటాయించినట్లు అధిష్టానం తెలిపినట్లు ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ శ్రీరాములు, కో–కన్వీనర్ నాగరాజుగౌడ్ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండలాధ్యక్షుడు వేణుగోపాల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీ అధిష్టానం ఆదోని అభ్యర్థి విషయంలో రెండు మూడు రోజుల్లో ప్రకటన చేస్తుందన్నారు. సమావేశంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మలేకర్ శ్రీనివాసులు, పట్టణాధ్యక్షుడు జిందే సాయి, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నాగార్జున, నాయకులు మల్లికార్జున, కోసిగయ్య, దేవేంద్ర, రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

ఉచిత ఎంసెట్ కోచింగ్

ఆదోని సెంట్రల్: ఇంజినీరింగ్‌లో ప్రవేశం పొందే విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉచితంగా ఎంసెట్ కోచింగ్ ఇవ్వనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. ఆదోని పట్టణంలోని విశ్వనారాయణ జూనియర్ కళాశాలలో ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు కోచింగ్ ఇవ్వనున్నామని వెల్లడించారు. ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 9052166745, 955291609 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అమల్లోకి ఎన్నికల కోడ్

- ఆదోనిలో నేతల విగ్రహాలకు ముసుగులు
- పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగింపు



విగ్రహాలకు ముసుగు వేసిన అధికారులు

ఆదోని సెంట్రల్: సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో శనివారం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని (మోడల్ కోడ్ అఫ్ కాండక్ట్) ఉల్లంఘిస్తే అభ్యర్థులు, అధికారులు శిక్షార్హులవుతారు. ఆదివారం ఆదోనిలో రాజకీయ నేతలకు సంబంధించిన విగ్రహాలకు ముసుగులు వేయడంతో పాటు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, బ్యానర్లను పురపాలక అధికారులు తొలగించారు.

ఎన్నికలకు సిద్ధమవుతున్న పార్టీలు

సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో రాజకీయ పార్టీలు ప్రచారం హోరెత్తించనున్నాయి. వైఎస్సార్‌సీపీ ఆదోని నియోజకవర్గ అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్యే వై. సాయి ప్రసాద్ రెడ్డి తన ప్రచారానికి సంసిద్ధులవుతున్నారు. తన ప్రచార రథాన్ని సిద్ధం చేసుకుంటున్నారు. పొత్తులో భాగంగా ఎవరికి సీటు వస్తుందో తెలియక అయోమయ పరిస్థితిలో జనసేన, టీడీపీ, బీజేపీలు ఉన్నాయి. కాషాయ పార్టీకే ఆదోని టికెట్ వరిస్తుందనే వార్త మూడు నాలుగు రోజులుగా చక్కర్లు కొడుతోంది. ఇక జనసేన పార్టీ నాయకులు సీటు తమదేనంటూ చెప్పుకుంటున్నారు. టీడీపీలో మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడుతో పాటు మరి కొందరు టికెట్ ఆశిస్తున్నారు. పొత్తులో భాగంగా టికెట్ ఎవరిని వరిస్తుందో మరికొద్ది రోజుల్లో తేలనుంది.

మార్గదర్శకాలు ఇలా

- అభ్యర్థులు ఎలాంటి ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనకూడదు.
- ఎన్నికల ప్రచారం నిర్వహించే అభ్యర్థులు రాత్రి 10 గంటల వరకే ప్రచారం చేయాలి.
- అభ్యర్థులు పత్రికలకు ఇచ్చే యాడ్స్‌తో పాటు సోషల్ మీడియాలోని ప్రకటనలు కూడా ఎన్నికల వ్యయం కింద పరిగణిస్తారు.
- ఎన్నికల అఫిడవిట్‌లో సోషల్ మీడియా అకౌంట్లు కూడా పొందుపరచాలి.
- జూన్ 6వ తేదీతో కోడ్ ముగుస్తుంది.

ఘనంగా శివజయంతి వేడుకలు




బ్రహ్మకుమారీల ర్యాలీ



శివలింగాలతో ప్రదర్శన

కౌతాళం: మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరియ విశ్వవిద్యాలయం 88 వార్షికోత్సవాన్ని మూడు రోజుల పాటు కౌతాళంలో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం మొదటి రోజు గ్రామ పురవీధుల మీదుగా శివలింగాలతో బ్రహ్మకుమారీలు ఊరేగింపు నిర్వహించారు. చిన్నారుల కోలాటాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీలు నిర్మాలా, అమృత, కృష్ణవేణి, లక్ష్మీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ శాంతితో జీవించాలని, అప్పుడే సమాజంలో శాంతి, సోదరభావం నెలకొంటుందన్నారు. మనిషిలో చేడు పెరిగిపోవడం వల్లే అనర్థాలకు దారి తీస్తున్నాయని తెలిపారు. రాత్రి పాత రాఘవేంద్రస్వామి ఆలయం వద్ద శివలింగాల ప్రదర్శన నిర్వహించారు.

21 నుంచి రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు



రంగనాథ స్వామి ఆలయం

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన రంగనాథుడి బ్రహ్మోత్సవాలు ఈ నెల 21వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పది రోజుల పాటు వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ ఈడిగ దస్తగిరి గౌడ్ తెలిపారు. 21న ధ్వజారోహణం, 22న సింహోత్సవం, 23న శేషోత్సవం, 24న లంకోత్సవం, 25న గరుడోత్సవం, 26న గజోత్సవం, 27న తెల్లవారుజామున చిత్తానక్షత్రంలో స్వామి వారి కల్యాణోత్సవం, అదే రోజు ఉదయం 10 గంటలకు రథాంగ హోమం, బ్రహ్మరథం, సాయంత్రం అశేష జనవాహిని మధ్య రథోత్సవం నిర్వహించనున్నారు. 28న అశ్వవాహనం, 29న ఉదయం పూర్ణాహుతి, వసంతోత్సవం, రాత్రి హంసవాహన సేవ, 30న ద్వాదశ ప్రదక్షిణోత్సవాలు, రాత్రి పాన్పు సేవ ఉంటాయన్నారు. భక్తులు బ్రహ్మోత్సవాలలో విరివిగా పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

హత్య కేసులో విచారణ ముమ్మరం

గోనెగండ్ల: మండల పరిధిలోని పెద్దమరివీడు గ్రామంలో కురువ నాగమ్మను ఆమె మనుమడు వెంకటేష్ గొంతు నులిమి చంపి ఆమె బంగారుతో సెల్‌ఫోన్ కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. వెంకటేష్ ఒక్కడే నానామ్మను హత్య చేసి ఇంటి ఆవరణలో గుంత తవ్వి పూడ్చడం సాధ్యమయ్యే పనేనా అనే అనుమానాలు గ్రామంలో వ్యక్తమవుతున్నాయి. వెంకటేష్‌తో పాటు గ్రామంలో మరో ఇద్దరు యువకులపై అనుమానం రావడంతో వారిని పోలీసులు ఆదివారం విచారణ చేసినట్లు తెలిసింది. ఈ విషయంపై సీఐ రామకృష్ణయ్యను వివరణ కోరగా అనుమానంతోనే ఇద్దరు యువకులను విచారిస్తున్నామని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

ఆధ్యాత్మిక మాసం.. రంజాన్

- నియమబద్ధంగా ఉపవాస దీక్షలు
- మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు



జామియా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నంద్యాలవ్యవసాయం: ముస్లింలకు పవిత్రమైన నెల రంజాన్ మాసం. ప్రారంభం నుంచి ముగిసే వరకు పగలు నిష్టగా రోజా(ఉపవాస దీక్ష) పాటిస్తారు. కేవలం ఆహార పానియాలు మానివేయడం మాత్రమే రోజా కాదని, నియమాలతో కూడుకున్న జీవన విధానాన్ని ఆచరిస్తారన్నారు. తెల్లవారుజామున ఆహారం తీసుకోవడాన్ని సహేరి, సాయంత్రం ఉపవాసదీక్ష విరమణలో తీసుకొనే ఆహారాన్ని ఇఫ్తార్ అంటారు. ప్రతిరోజూ సుమారుగా 13 గంటల పాటు కఠిన ఉపవాస దీక్ష అవలంభిస్తారు.

రోజూ 5 పూటల నమాజ్‌తో పాటు రాత్రి ఈషా నమాజ్ అనంతరం ప్రత్యేక తరావీ ప్రార్థనలు చేసి ముగిస్తారు. సాయంత్రం ఉవాపదీక్షలు విరమించే సమయంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుతో ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పాటు చేసుకుంటుంది. ఇఫ్తార్‌లో ముస్లింలు, పేద, ధనిక తేడా లేకుండా సామూహికంగా పాల్గొంటారు.

రంజాన్ ప్రత్యేక నియమాలు..

షబ్–ఏ–ఖదర్..

రంజాన్ మాసం ప్రారంభమైన 27వ రోజు షబ్–ఏ–ఖదర్‌ను నిర్వహిస్తారు. ఆ రోజు ఖురాన్ అవతరించిందని, ముస్లింల విశ్వాసం. ఆ రోజు రాత్రంతా జాగారణ చేసి నమాజ్‌తో గడుపుతారు. ఇలా చేసిన వారికి ఎన్నో ఏళ్ల నమాజ్‌లు చేస్తే దక్కే పుణ్యఫలితం దక్కుతుందని విశ్వాసం.

జకాత్..

ముస్లింలకు నమాజ్, రోజా ప్రకారమే జకాత్ కూడా నిర్ణయించబడింది. దైవాన్ని ప్రసన్నం చేసుకోడానికి, తాము సంపాదించిన ధనాన్ని కొంత మొత్తాన్ని పేదలకు అందించడమే జకాత్ ముఖ్య ఉద్దేశం. రంజాన్ నెలలోనే ముస్లింలు విధిగా జకాత్ చెల్లిస్తారు. పేద, ధనిక అంచనాలను రూపుమాపు చేయడానికి జకాత్ సహాయ పడుతుంది. జకాత్ అంటే పరిశుద్ధ పరిచేదని అర్థం.

ఫిత్రా (దానం)..

ఈ నెల అంతా రోజా, నమాజ్, జకాత్ చెల్లించడంతో పాటు నెల ముగిసి పండుగ జరుపుకొనే ముందు రోజు పేదలకు దానం చేయడాన్ని ఫిత్రా అంటారు. పేదలు కూడా పండుగ రోజు సంతోషంగా పాల్గొనడానికి చేసిందే ఈ ఏర్పాటు. కుటుంబ సభ్యులు ఎంత మంది ఉంటారో అందరి తరపున విధిగా ఫిత్రా చెల్లిస్తారు. ఒక్కొక్క ఫిత్రా కింద రెండున్నర కిలోల ఆహార ధాన్యాలు, అందుకు సమానమైన నగదును అందజేస్తారు.

హలీమ్..

ఇఫ్తార్ సమయంలో సేవించే హలీమ్‌కు కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. మసాలా దినుసులు, డ్రైఫ్రూట్స్‌తో పాటు బొంబాయి రవ్వ, బియ్యం రవ్వ, మేక లేదా పొట్టేలు మాంసం తదితర పదార్థాలు కలిపి ఉడకబెట్టి జావా తయారు చేస్తారు. దీన్ని ప్రత్యేకంగా మట్టి పాత్రల్లో సేవిస్తారు.

షవ్వాల్..

నెలంతా పవిత్ర కార్యక్రమాలతో సాగిన ఉపవాస దీక్ష షవ్వాల్ నెలవంక ప్రత్యక్షం అవగానే ముస్లింలు ఉపవాసాలు విరమించి మరుసటి రోజు పండుగను భక్తి శ్రద్ధలతో సంతోషంగా నిర్వహిస్తారు. షవ్వాల్ నెల మొదటి రోజు జరుపుకొనే పండుగను ఈదుల్ ఫితర్ అంటారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

కృష్ణగిరి: పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కొలుకోలేక మృతి చెందాడు. ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని లాల్‌మాన్‌పల్లెకు చెందిన అల్లాబకాష్ (42), హలిమా దంపతులకు ఇద్దరు కుమార్తెలు సంతానం. వీరు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 14న అల్లాబకాష్ మామిడి చెట్లకు పూత రాలకుండా మందు స్ప్రే చేసి వస్తానని ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడిఉండటాన్ని గుర్తించిన రైతులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు వెంటనే డోన్ ఆస్పత్రికి అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించగా కొలుకోలేక ఆదివారం అల్లాబకాష్ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. కుమార్తె వివాహం, వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చలేమనే మనస్తాపంతో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు భార్య హలిమా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.